ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జయశంకర్ భూపాలపల్లి


5

ములుగు

శుక్రవారం 23 ఆగస్టు 2024



ఎంక్వైరీపై వర్రీ



మేడిగడ్డ బ్యారేజీ ఇంజనీర్లలో గుబులు

విజిలెన్స్ మధ్యంతర నివేదికతో ఆందోళన

కమిషన్ ముందు క్రాస్ ఎగ్జామినేషన్ మొదలవడంతో టెన్షన్

21 మంది అధికారులు ఎవరనేదే చర్చ

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 22 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీ ఇంజనీర్లలో ఆందోళన నెలకొంది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఇచ్చిన నివేదిక ఆధారంగా పీసీ ఘోష్ కమిషన్ విచారణ చేప్పేందుకు మధ్యంతర ఉత్తర్వులు వెలువరించిన నేపథ్యంలో గుబులు మొదలైంది. ఎప్పుడేం జరుగుతుందోననే టెన్షన్ పట్టుకుంది. బ్యారేజీ కుంగుపాటుకు 21 మంది ఇంజనీర్ల పాత్ర ఉందని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పీసీ ఘోష్ కమిషన్‌కు నివేదిక అందించారు. దీనిపై ఇంజనీరింగ్ అధికారుల్లో ఆందోళన మొదలైంది. ఏక్షణాన కాళేశ్వరం ప్రాజెక్టు ఎంక్వైరీ కమిషన్ నుంచి పిలుపు వస్తుందోనని పలువురు హడలిపోతున్నారు. కొన్ని నెలలుగా సాఫీగా సాగుతున్న విచారణ కొత్త మలుపు చోటుచేసుకోవడం ఆ శాఖలో మరోమారు అలజడి సృష్టించింది.

ఎవరెవరిని పిలుస్తారో..?

గత సంవత్సరం అక్టోబరు 20న మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాకుల్లో 19, 20, 21వ పిల్లర్లు కుంగుబాటుకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ, స్టేట్ డ్యాం సేఫ్టీ అథారిటీలు బ్యారేజీని పరిశీలించాయి. ఆ వెంటనే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖతో విచారణకు ఆదేశాలు జారీ చేసింది. ఈ విచారణ కొనసాగుతుండగానే జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌తో న్యాయ విచారణ ప్రారంభమైంది. అప్పటి నుంచి ఇంజనీరింగ్ అధికారుల కంటికి కునుకు కరువైంది. ఏఈఈ స్థాయి నుంచి ఈఎన్‌సీ, సీఈ స్థాయి వరకు బ్యారేజీ నిర్మాణంలో భాగస్వామ్యం వహించిన ప్రతి ఒక్కరిపై విచారణ జరిగింది. తాజాగా విజిలెన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు పీసీ ఘోష్ కమిషన్‌కు మధ్యంతర నివేదిక సమర్పించారు. బ్యారేజీ కుంగుబాటుపై 21 మంది ఇంజీనీర్ల పాత్ర ఉందంటూ పేర్కొనడంతో అక్కడ పనిచేసిన, పనిచేస్తున్న అధికారుల్లో ఆందోళన మొదలైంది. దీనికి ముందు బ్యారేజీలో పనిచేసే అధికారుల నుంచి అఫిడవిట్‌లో సమాచారం సేకరించిన కమిషన్ తాజా పరిణామాల నేపథ్యంలో ఎవరెవరిని క్రాస్ ఎగ్జామిన్ చేస్తుందోననే చర్చ కొనసాగుతోంది.

ఎవరా 21 మంది?

పీసీ ఘోష్ కమిషన్‌కు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్ జనరల్ సీవీ ఆనంద్ ఇచ్చిన మధ్యంతర నివేదికలో ఉన్న అధికారులు ఎవరనేది ప్రధానంగా చర్చనీయాంశమైంది. 21మంది జాబితాలో ఏస్థాయి అధికారుల పేర్లు ఉన్నాయో.. అనే గుబులు మొదలైంది. బ్లాక్-7కు ప్రాతినిధ్యం వహించిన ఇంజనీరింగ్ అధికారులతోపాటు ఈఈ, ఎస్ఈ, సీఈల వరకు ఇందులో ఉన్నారనే టాక్ వినిపిస్తోంది. వీరితో పాటు బ్యారేజీలోని మిగతా ఇంజనీర్లను కూడా విచారిస్తారా? అనేది ఇంజనీరింగ్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇదిలా ఉండగా కొంతమంది ఇంజనీర్లు మాత్రం బాధ్యులు ఎవరైనా విచారణ మాత్రం తమకు తప్పేలా లేదంటూ వాపోతున్నారు. అప్పటి బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బ్యారేజీ అంశాన్ని రాజకీయంగా వాడుకుంటూ అందులో పనిచేసే ఇంజనీర్ల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని కొంత మంది అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొత్తానికి విజిలెన్స్ మధ్యంతర నివేదిక, కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ పర్వంతో ఇంజనీరింగ్ అధికారుల్లో కలవరం మొదలైంది. ఇందులో ఎవరెవరిని బాధ్యులు చేస్తారోననేది చర్చనీయాంశంగా మారింది.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



కలెక్టరేట్ ఆవరణలో మొక్కను నాటి నీరు పోస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 22: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పరిరక్షించాలని, ఇందుకు విరివిగా మొక్కలు నాటాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. డీఆర్డీవో ఆధ్వర్యంలో జరిగిన 'నాటుదాం ఒక చెట్టు.. అమ్మ పేరు మీద' కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. మనిషి మనుగడకు మొక్కలు దోహదపడతాయన్నారు. మొక్కల ప్రాధాన్యతను గుర్తించి ప్రతి ఒక్కరూ తమ జీవితంలో జరిగే శుభకార్యాలకు గుర్తుగా తప్పకుండా మొక్కలను నాటాలని సూచించారు. క ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీవో నరేష్, అదనపు డీఆర్డీవో వసుమతి తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవం లక్ష్యాన్ని పూర్తి చేయాలి

వన మహోత్సవ లక్ష్యాన్ని వారం రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. వన మహోత్సవంపై అటవీ, డీఆర్డీఏ, ఉద్యాన, వ్యవసాయ, పోలీసు, ఎక్సైజ్, సింగరేణి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమం ద్వారా 26.13 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం ఉండగా ఇప్పటి వరకు 21.72 లక్షల మొక్కలను నాటినట్లు తెలిపారు. మునిసిపల్ పరిధిలోని ప్రతి ఇంటికీ ఆరు మొక్కలు నాటేందుకు పంపిణీ చేయాలన్నారు. ఇక్కడ 1.60లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం ఉండగా 45,840 మొక్కలు మాత్రమే ఇప్పటి వరకు నాటారన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలన్నారు. జిల్లా ఆస్పత్రిలో శనివారం మాస్ ప్లాంటేషన్ చేయాలన్నారు. సింగరేణి, కేటీపీపీ పారిశ్రామిక వాడలతోపాటు పట్టణంలోని రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎఫ్‌వో వసంత, డీఆర్డీవో నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకు మోదీ ఊడిగం

- లోక్‌సభ ఎన్నికల్లో నైతికంగా ఓడిన బీజేపీ
- అత్తెసరు మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు
- నితీష్, చంద్రబాబు ఊతకర్రల సాయం ఎంతకాలం?
- సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా
- ఘనంగా ప్రారంభమైన సీపీఐ రాష్ట్ర సమావేశాలు

వివరాలు 7వ పేజీలో..



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

ములుగు ఎస్పీ శబరీశ్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ శబరీశ్

ములుగు, ఆగస్టు 22: జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ శబరీశ్ హెచ్చరించారు. ర్యాగింగ్ వ్యతిరేక ప్రచారంలో భాగంగా గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను వేధించడం, దూషించడం, దాడి చేయడం, అగౌరవపరచడం, మానసికంగా, శారీరకంగా, లైంగికంగా వేధించడం, అమర్యాదగా ప్రవర్తించడం, నేరపూరిత ఉద్దేశం కలిగి ఉండటం, వారిని నిరోధించడం, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించడం, డబ్బులు లాక్కోవడం వంటి చర్యలకు పాల్పడితే ర్యాగింగ్‌గా పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు. ర్యాగింగ్ పాల్పడిన విద్యార్థుల అడ్మిషన్ రద్దు అవుతుందని, పాఠశాల/కళాశాల నుంచి సస్పెండ్ అవుతారని, కేసు నమోదవుతుందని వివరించారు. తల్లిదండ్రుల ఆశయాలు, కలలను సాకారం చేసేలా బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే 8712670120 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ఈకార్యక్రమంలో ఓఎస్డీ గీతే మహేష్ బాబాసాహెబ్, డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్, ఆర్ఐ అడ్మిన్ వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దేవుళ్లపై ఒట్టేశారు.. నట్టేట ముంచారు

కాంగ్రెస్ సర్కారుపై మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మండిపాటు



రేగొండలో రాస్తారోకో చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు

రేగొండ, ఆగస్టు 22 : 'ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చారు.. వాటిని నెరవేరుస్తామని దేవుళ్లపై ఒట్టేసి చెప్పారు. ఆ తర్వాత ప్రజలను నట్టేట ముంచారు' అని కాంగ్రెస్ సర్కారుపై భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే నిప్పులు చెరిగారు. రైతులందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ గురువారం చేపట్టిన నిరసన కార్యక్రమం రేగొండలో జరిగింది. పరకాల-భూపాలపల్లి ప్రధాన రహదారిపై పార్టీ నేతలు, కార్యకర్తలు రాస్తారోకో చేశారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరికీ రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ దానిని విస్మరించిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు పథకాన్ని రద్దు చేసి రూ. 2 లక్షల లోపు రుణమాఫీ చేస్తామని చెప్పి 40శాతం మాత్రమే చేశారని మండిపడ్డారు. పైగా రైతులందరికీ రుణమాఫీ చేశామని నిస్సిగ్గుగా ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. తక్షణమే ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రూ. 2 లక్షల లోపు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాపిరెడ్డి, పార్టీ యువజన విభాగం నాయకుడు సాంబారి సాయికుమార్, కోటంచ ఆలయ మాజీ చైర్మన్లు కొల్గూరి రాజేశ్వరరావు, మాదాడి అనిత, మాజీ ఎంపీటీసీ హమీద్, బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు ప్రశాంత్‌రావు, నాయకులు రూపిరెడ్డి చంద్రారెడ్డి, రఘుసాల తిరుపతిరావు, మాడగాని నరేష్, పసుల అశోక్, రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్త కలకలం

రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్త ఒకరు కలకలం సృష్టించాడు. బీఆర్ఎస్ శ్రేణుల మధ్యలోకి దూసుకొచ్చిన హరీశ్ అనే కాంగ్రెస్ కార్యకర్తల మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని నిలదీశాడు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తనకు ఇల్లు కేటాయిస్తానని హామీ ఇచ్చారని, అదెందుకు నెరవేరలేదని ప్రశ్నించాడు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని అతడిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ తీరుపై మండిపడ్డారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్‌పై తమ కార్యకర్తలను కాంగ్రెస్ నేతలు ఉసిగొల్పడం అభద్రతా భావానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి నాగజ్యోతి



ములుగులోని జాతీయ రహదారిపై బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

ములుగు, ఆగస్టు 22: రాష్ట్రంలోని రైతులందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి ఆధ్వర్యంలో నాయకులు ములుగులోని 163వ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కారని అన్నారు. కనీసం 45శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ చేయలేదని విమర్శించారు. రైతులకు రుణం ఇచ్చే రోజున లేని నిబంధనలు రుణమాఫీ చేసే సమయంలో ఎందుకు అడ్డొస్తున్నాయని ఆమె ప్రశ్నించారు. నిబంధనల పేరుతో రైతుల రుణమాఫీని ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని, లేనట్లయితే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు, రైతులు తగిన బుద్ధి చెబుతారని ఆమె హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ దివాకరకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పోరిక గోవింద్‌నాయక్, పాలెపు శ్రీనివాస్, కందకట్ల సారయ్య, భూక్య జంపయ్య, పోరిక విజయ్‌రాం, దాసరి రమేష్, ఆరెందుల కుమార్, మాచర్ల ప్రభాకర్, శ్రీను, గడ్డమీది భాస్కర్, గండి కుమార్, ఆకుతోట చంద్రమౌళి, ముడతనపల్లి మోహన్, ఆదిరెడ్డి, కవ్వంపల్లి బాబు, రాజాహుస్సేన్‌తోపాటు పెద్దసంఖ్యలో కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

'వరంగల్ జిల్లా'కు గవర్నర్ రాక

- ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు పర్యటన
- రచయితలు, కళాకారులు, ఉన్నతాధికారులతో సమావేశం
- చారిత్రక, పర్యాటక ప్రాంతాలను సందర్శించనున్న జిష్ణుదేవ్‌వర్మ
- జిల్లాలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్న ఆయా జిల్లాల కలెక్టర్లు



వివరాలు 7వ పేజీలో

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 22 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బుధవారం బ్యారేజీలోకి 1.75 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 85 గేట్లను ఎత్తి, వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి 3 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. అన్నారం బ్యారేజీకి 1,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 66 గేట్లను ఎత్తి, వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు.

కాటారం సబ్ కలెక్టర్‌గా మయాంక్ సింగ్

కాటారం, ఆగస్టు 22 : కాటారం సబ్ కలెక్టర్‌గా మయాంక్ సింగ్ (ఐఏఎస్) నియమితులయ్యారు. ఈమేరకు చీఫ్ సెక్రటరీ శాంతికుమారి గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది ఆగస్టులో కాటారం కేంద్రంగా నూతన రెవెన్యూ డివిజన్ ఏర్పాటైంది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ డివిజన్‌కు సబ్ కలెక్టర్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇందులో భాగంగా 2022 బ్యాచ్ ట్రైనీ ఐఏఎస్‌లను తెలంగాణ కేడర్‌కు కేటాయించారు. వారి నుంచి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన సబ్ కలెక్టర్ కార్యాలయాలకు నియమించారు. మయాంక్ సింగ్ గతంలో ఖమ్మం అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేసినట్లు తెలుస్తోంది.

మాటకు కట్టుబడి పనిచేస్తున్నాం..

8 నెలలు గడవక ముందే రాజకీయం చేయడం సిగ్గుచేటు

పదేళ్లలో బీఆర్ఎస్ ఒరగబెట్టిందేమీ లేదు..

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 22: ప్రజలకు ఇచ్చిన మాటకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. పదేళ్లపాటు పరిపాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి కూరుకుపోయేలా చేసిందని ధ్వజమెత్తారు. భూపాలపల్లిలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన మాటకు కట్టుబడి రైతులకు రుణమాఫీ చేశామని అన్నారు ఇంకా కొంతమంది కొన్ని సమస్యల కారణంగా మిగిలి ఉన్నాయనే విషయాన్ని గుర్తించామన్నారు. వారికి కూడా రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చాలా స్పష్టంగా చెప్పారని అన్నారు. ఇందులో భాగంగానే గ్రామాల్లో విచారణ కూడా ప్రారంభించనున్నట్టు తెలిపారు. పదేళ్ల తన పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని విమర్శించారు. నిరుద్యోగులకు భృతి ఇవ్వలేదని, దళితుడిని సీఎం చేయలేదని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించలేదని దుయ్యబట్టారు. జర్నలిస్టులకు ప్రత్యేక ఇళ్లు నిర్మించి ఇస్తానని నమ్మబలికి మోసం చేసిందని విమర్శించారు. ఇంటికో ఉద్యోగం లేదని, కేజీ టు పీజీ లేదని అన్నారు. దోచుకోవడం, దాచుకోవడం తప్ప బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని ఆరోపించారు. అదే కాంగ్రెస్ 2023 డిసెంబరు 7న అధికారం చేపట్టిన నాటి నుంచి ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఇందులో భాగంగానే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందన్నారు. తద్వారా ఆర్టీసీకి రూ.2,300 కోట్లు డబ్బులు చెల్లించామని అన్నారు. 200 యూనిట్లు కరెంటు ఉచితంగా ఇస్తున్నామని, ఇంకా ఇది వర్తించని వారి నుంచి దరఖాస్తులు స్వీకరించేలా కౌంటర్లు ఏర్పాటు చేశామని అన్నారు. పేదలకు ఆరోగ్యశ్రీ పథకం కోసం రూ.10లక్షలు ఇస్తున్నామని, విద్య కోసం 7శాతం నిధులు కేటాయించామని, వైద్యం కోసం ప్రత్యేక వైద్య నిపుణులను, సిబ్బంది కొరత తీర్చామని తెలిపారు. వంటగ్యాస్‌ను రూ.500కే అందేలా కృషి చేశామని తెలిపారు. నిరుపేదలకు రాష్ట్ర వ్యాప్తంగా 4.5 లక్షల ఇళ్లు మంజూరు చేశామని, ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షలు, వెనుకబడిన తరగతులకు రూ.5లక్షలు ఇచ్చేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 2లక్షల ఉద్యోగాల కోసం షెడ్యూల్ ప్రకటించామని, ఇప్పటికే 30వేలు భర్తీ చేశామని తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నట్లు తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని 124 చెరువులకు మరమ్మతులు చేపట్టామని, తెగిపోయిన రోడ్లు, వంతెనలను పూర్తి చేస్తున్నామని అన్నారు. గడిచిన 8నెలల్లో అనేక హామీలను అమలులోకి తీసుకొచ్చిన ప్రభుత్వం ప్రజల కోసం ఇంకెంతో చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. బీఆర్ఎస్ నాయకులు రాజకీయ కుట్రలో భాగంగా సిగ్గులేకుండా బీఆర్ఎస్ రోడ్లు ఎక్కుతున్నారని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, నాయకులు బుర్ర కొంరయ్య, చల్లూరి సమ్మయ్య, దేవన్, ముంజాల రవీందర్, రాజేందర్, తాటి అశోక్, దాట్ల శ్రీనివాస్, అంబాల శ్రీనివాస్, సాంబమూర్తి, పాషా, తిరుపతి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సివిల్ సప్లయ్ అధికారులు



డీఎం రాములును సన్మానిస్తున్న మిల్లర్లు

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 22: భూపాలపల్లి పౌరసరఫరాల జిల్లా అధికారి (డీఎస్‌వో) శ్రీనాథ్, జిల్లా మేనేజర్ (డీఎం) రాములు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని తమ కార్యాలయాల్లో చార్జ్ తీసుకున్నారు. బాధ్యతల స్వీకరణ అనంతరం కలెక్టర్ రాహుల్‌శర్మను డీఎం మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగా విధుల్లో చేరిన డీఎస్‌వో, డీఎంను జిల్లా మిల్లర్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మిల్లర్స్ అసోసియేషన్ ఇన్‌చార్జి ప్రెసిడెంట్ పెరుమాండ్ల తిరుపతి, మిల్లర్లు రవీందర్‌రెడ్డి, సంతోష్, బిక్షపతి, రవీందర్ రెడ్డి, రఘుపతి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖలో
అధికారుల బదిలీలు

బాలసముద్రం, ఆగస్టు22: హనుమకొండ జిల్లా వ్యవసాయశాఖలో అధికారులు బదిలీ అయినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు గురువారం తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి ఆదేశాలతో మల్టీజోన్-1పరిధిలోని హనుమకొండ, వరంగల్ జిల్లాలో పని చేస్తున్న అధికారులకు సాధారణ బదిలీలు అయినట్లు తెలిపారు. ఎం.లక్ష్మీనారాయణ మహబూబాబాద్ నుంచి హనుమకొండ ఏడీఏగా, హనుమకొండ ఏడీఏగా పని చేసిన కె.దామోదర్‌రెడ్డి నర్సంపేటకు బదిలీ అయ్యారు. అగ్రికల్చర్ టెక్నికల్ ఏవోలుగా అఫ్జల్‌పాషా, భీమదేవరపల్లి నుంచి హనుమకొండకు బదిలీ కాగా, బి.మాధవి హనుమకొండ నుంచి దుగ్గొండికి బదిలీ అయ్యారు. కాజీపేట ఏవోగా పని చేసిన శ్రీధర్‌రెడ్డి హనుమకొండ అగ్రికల్చర్ టెక్నికల్ ఏవోగా వచ్చారు. భీమదేవరపల్లి ఏవోగా రాజేష్, నూతన మండలం వేలేరు ఏవోగా లలిత, ఐనవోలు ఏవోగా సీహెచ్. సునీల్‌కుమార్, నడికూడ ఏవోగా పోరిక జైసింగ్, దామెర ఏవోగా రాకేష్‌లు బదిలీలపై వచ్చినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. వరంగల్, హనుమకొండ హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్‌గా జి.సంగీత నల్లగొండ జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. వరంగల్ హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్‌గా పని చేసిన శ్రీనివాసరావు కరీంనగర్‌కు బదిలీ అయ్యారు. వరంగల్, హనుమకొండ జిల్లా హార్టికల్చర్ అధికారిగా చెరల రాకేష్ తొర్రూర్ నుంచి బదిలీపై వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 22: ఓపెన్ స్కూల్ ద్వారా నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజును ఈ నెల 30లోపు చెల్లించాలని ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్‌లో నిర్వహించే సప్లిమెంటరీ పరీక్షలకు మీసేవ, టీఎస్ఆన్‌లైన్ తదతర కేంద్రాల ద్వారా ఫీజు చెలంచాలని తెలిపారు. ఆగస్టు 30 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా, సెప్టెంబర్ 4 వరకు రూ. 25 అపరాధ రుసుముతో, సెప్టెంబర్ 9 వరకు రూ. 50 అపరాధ రుసుముతో చెల్లించేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

నేటి నుంచి సెమీ డీలక్స్ ఆర్టీసీ సర్వీసులు

బాలసముద్రం, ఆగస్టు 22: వరంగల్ రీజియన్ పరిధిలో సెమీ డీలక్స్ ఆర్టీసీ బస్సు సర్వీసులను శుక్రవారం నుంచి నూతనంగా నడుపనున్నట్లు రీజినల్ మేనేజర్ డి.విజయభాను గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ నుంచి భూపాలపల్లి, ఏటూరునాగారం, కాళేశ్వరం రూట్లలో సెమీ డీలక్స్ బస్సు సర్వీసులను నడుపనున్నట్లు తెలిపారు. హనుమకొండ నుంచి ఏటూరునాగారం టికెట్ ధర ఎక్స్‌ప్రెస్ రూ.160, సెమీ డీలక్స్ రూ.180, డీలక్స్ రూ.190, హనుమకొండ నుంచి భూపాలపల్లికి ఎక్స్‌ప్రెస్ రూ.100, సెమీ డీలక్స్ రూ.110, డీలక్స్ రూ.110, హనుమకొండ నుంచి కాళేశ్వరం ఎక్స్‌ప్రెస్ రూ.160, సెమీ డీలక్స్ రూ.180, డీలక్స్ రూ.190 కాగా, బస్సు ప్రయాణం చేసిన ప్రతీ ఒక్కరు టికెట్ తీసుకోవలసి ఉంటుందన్నారు.

కార్పొరేట్ శక్తులకు మోదీ ఊడిగం

● జమ్మూకశ్మీర్, హరియాణా ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయం ● తెలంగాణలో సీపీఐకి ఇచ్చిన హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోవాలి
● సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా ● ఘనంగా ప్రారంభమైన సీపీఐ తెలంగాణ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు

హనుమకొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని, ఆదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతోందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా ఆరోపించారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో సీపీఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ నిర్మాణసమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఈ సమావేశాలకు రాజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మోదీ విధానాలను తూర్పారబట్టారు. మోదీ అండదండలతో కార్పొరేట్ శక్తులు దేశాన్ని నిలువునా దోచుకుంటున్నాయని ధ్వజమెత్తారు. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌. కార్పొరేట్ శక్తుల కొమ్ముకాసేలా ఉందన్నారు. సామాన్యుల ఆశలు, ఆకాంక్షలు ఆ బడ్జెట్‌లో ఏ మాత్రం ప్రతిఫలించలేదని అన్నారు. బడ్జెట్‌లో విద్య, వైద్యం, తదితర కీలక రంగాలకు ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించే ఏ చర్యను బడ్జెట్‌లో ప్రతిపాదించలేదన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య అంతకంతకూ పెరిగిపోతోందని, పరిష్కారానికి మోదీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. రూపాయి విలువ దారుణంగా పతనమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆదానీ, అంబానీ అక్రమాలపై విచారణ జరపాలని డి.రాజా డిమాండ్ చేశారు. ఆదానీ గ్రూపులో సెబీ ఛైర్మన్ విదేశాల్లో అక్రమ పెట్టుబడులు పెట్టారంటూ హిండెన్‌బర్గ్ సంస్థ చేసిన ఆరోపణలపై ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, దీనిపై విచారణకు జాయింట్ పార్లమెంట్ కమిటీ (జేపీసీ) వేయాలని రాజా డిమాండ్ చేశారు. హిండెన్ బర్గ్ ఆరోపణల నేపథ్యంలో సెబీ ఛైర్మన్‌తో రాజీనామా చేయించాలన్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సాధించింది గెలుపుకాదని, ప్రజల ఆ పార్టీని నైతికంగా ఓడించం ద్వారా తగిన గుణపాఠం చెప్పారన్నారు. 400 స్థానాలతో అధికారంలోకి వస్తామని ఎన్నికల ప్రచార సభల్లో పదేపదే చెప్పిన మోదీ.. 250లోపు సీట్లకే పరిమిత మయ్యారన్నారు. నితీష్‌కుమార్, చంద్రబాబు నాయుడు ఊతకర్రల సాయంతో కేంద్రంలో మూడోసారి మోదీ ప్రభుత్వం ఏర్పాటైందని, ఈ ఇద్దరి మద్దతు ఎంతకాలం ఉంటుందనేది పెద్ద ప్రశ్న అని అన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారిందని మోదీ చెబుతున్నా.. ప్రజలకు రేషన్ ఉచితంగా ఇచ్చే పరిస్థితి ఇంకా ఎందుకు ఉందని ప్రశ్నించారు. ఇప్పటికీ దేశంలోని నిరుపేదల్లో చాలా మందికి రేషన్‌కార్డులు లేవని, ఇది దేశ వ్యాప్త సమస్య అని, వారందరికీ కార్డులు ఇచ్చే



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డి.రాజా

దిశగా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు.

పశ్చిమ బెంగాల్‌లో ఒక మెడికో విద్యార్థినిపై అత్యాచార సంఘటనపై దేశవ్యాప్తంగా అట్టుడుకుతున్నా..మోదీ మౌనం వీడడం లేదని రాజా పేర్కొన్నారు. దేశంలో మహిళలపై దాడులు రోజు రోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చివరికి సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవలసిన పరిస్థితి ఎందుకు వచ్చిందని నిలదీశారు. వైద్యవృత్తిలో కొనసాగుతున్నవారికి రక్షణ కోసం ఒక కేంద్ర చట్టాన్ని తీసుకురావాలన్న డిమాండ్‌ను మోదీ అంగీకరించడం లేదని రాజా ఆరోపించారు. ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాజ్యాంగంపై ప్రత్యక్షంగా దాడి చేస్తోందని, ప్రజాస్వామిక విలువలను కాలరాస్తోందన్నారు. మనది భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశమని, ఈ భావనకు తూట్లు పొడుస్తూ రాజ్యాంగ, ప్రజాస్వామ్య, లౌకిక విధానాలకు భిన్నంగా ఒకే దేశం.. ఒకే ఎన్నిక, ఒకే దేశం.. ఒకే మతం వంటి నినాదాలతో మోదీ ప్రభుత్వం విచ్ఛిన్నకర పాలనను సాగించాలని చూస్తోందని ధ్వజమెత్తారు. బ్యూరోక్రసీలోకి ఆర్‌ఎస్‌ఎస్ శక్తులను జొప్పించే ప్రయత్నం మోదీ చేస్తున్నారని, ఇదే జరిగితే భవిష్యత్తులో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతోందన్న ఆవేదన ఆయన వ్యక్తం చేశారు.

రాజ్యాంగం స్థానంలో కొత్త మతతత్వ రాజ్యాంగాన్ని తేవడానికి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలు చేస్తున్నాయని రాజా అన్నారు. నిత్యం రామజపం చేసే బీజేపీకి రాముడు జన్మించిన ప్రదేశంలోనే ప్రజలు ఓటుతో ఓడించి బుద్ధి చెప్పారన్నారు. మోదీ అనుసరిస్తున్న విధానాల పట్ల జమ్మూ కశ్మీర్ ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, అక్కడ శాంతి భద్రతలను కాపాడేందుకే చర్యలు తీసుకున్నామని గొప్పగా చెబుతున్నప్పటికీ ఇప్పటికీ ఉగ్రవాదుల మారణకాండ కొనసాగుతూనే ఉందన్నారు. జమ్మూకశ్మీర్, హరియాణాలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమన్నారు. ఆ తర్వాత మహారాష్ట్ర, జర్ఖండ్ రాష్ట్రాల్లో కూడా ఇదే పరిస్థితి పునరావృతం అవుతుందని రాజా జోస్యం చెప్పారు. కశ్మీర్‌లో పరిస్థితులను చక్కదిద్దడంలో మోదీ దారుణంగా విఫలమయ్యారని విమర్శించారు. వినేష్ పొగట్ ఒలంపిక్‌లో గోల్డ్‌మెడల్ తెచ్చేవారని, బీజేపీ అనుసరించిన విధానాల వల్లే పతకం జేజారిందని చెప్పారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక, రాజ్యాంగ వ్యతిరేక, మతతత్వ విధానాలను అడ్డుకునేందుకు ప్రజాస్వామికవాదులు, ప్రజలు ఒక్కటికావాలని రాజా పిలుపు నిచ్చారు. ఇటీవలి లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్లు, సీట్లను పెంచుకోవడం ద్వారా బలమైన ప్రతిపక్షంగా నిలబడిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండు ఎమ్మెల్సీ సీట్లు ఇస్తానని చెప్పి జాప్యం చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై కొద్దినెలలే అయినందువల్ల వేచిచూస్తున్నామన్నారు.

సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సృష్టించిన సంక్షోభం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం బయటపడలేకపోతోందన్నారు. రుణమాఫీ వంద శాతం అమలు కాలేదని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేకతను మూటకట్టుకోవద్దని కోరుకుంటున్నామన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు పాలన సాగని పక్షంలో పోరాటం చేస్తామని కూనంనేని వెల్లడించారు. బీఆర్ఎస్ పని అయిపోయిందని, బీజేపీని నిలువరించడంతో పాటు సీపీఐ బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో బీజేపీ బలపడకుండా అడ్డుకునేందుకు కాంగ్రెస్‌కు తమ పార్టీ మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజాసమస్యలపై నిత్యం పోరాడుతున్న సీపీఐని మరింత బలోపేతం చేయాడానికి అనుసరించాల్సిన విధివిధానాలపై కౌన్సిల్ నిర్మాణ సమావేశంలో లోతుగా చర్చించనున్నట్టు తెలిపారు. ఇప్పటికే జిల్లా, మండల, గ్రామ స్థాయిలో కౌన్సిల్ నిర్మాణ సమావేశాలను పూర్తి చేసుకున్నామన్నారు. డిసెంబర్ 25నాటికి సీపీఐ వందేళ్లు పూర్తి చేసుకుంటుందని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజాసమస్యలపై ఒక క్రియాశీల, మిలిటెంట్ పార్టీగా సీపీఐ పోరాటాలు కొనసాగిస్తోందని చెప్పారు.

ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ, జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస రావు, సీపీఐ నాయకుడు అజీజ్‌పాషా, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు డి.రాజా సమావేశాల ప్రాంగణంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్రకార్యవర్గం సమావేశమైంది. వివిధ అంశాలపై చర్చించింది.

సీపీఐ నేతలను కలిసిన వినయభాస్కర్


డి.రాజాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వినయభాస్కర్

బాలసముద్రం, ఆగస్టు 22: హనుమకొండ మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ గురువారం సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా, జాతీయ కార్యదర్శులు చాడా వెంకట్‌రెడ్డి, కూనంనేని సాంబశివరావులను హనుమకొండలోని హరిత హోటల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ నిర్మాణ సమావేశాలకు హాజరైన జాతీయ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. అక్కడికి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ హాజరై జాతీయ నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ హనుమకొండలో చాలాసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందినట్లు జాతీ య నాయకులకు కూనంనేని సాంబశివరావు పరిచ యం చేశారు. అనంతరం వినయ్ భాస్కర్‌తో ఎమ్మెల్యే కూనంనేని సరదాగా మాట్లాడుతూ.. మీరు చేసుకున్న అపకారమే మీ ఓటమికి కారణాలని అనగా.. వినయ్‌భాస్కర్ అక్కడి నుంచి నవ్వుకుంటూ బయటకు వెళ్లిపోయారు. కాగా సీపీఐ జాతీయ నాయకులను వినయ్ భాస్కర్ కలవడంపై పలువురు ఆసక్తిగా చర్చించుకున్నారు.


హనుమకొండలో సీపీఐ జెండా ఎగురవేస్తున్న జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, నాయకులు

అట్టహాసంగా సీపీఐ సమావేశాలు ప్రారంభం

హాజరైన సీపీఐ జాతీయ నేతలు డి.రాజా, చాడ వెంకట్‌రెడ్డి, నారాయణ
విడతల వారీగా సమావేశాలు నిర్వహించిన నేతలు

బాలసముద్రం, ఆగస్టు 22: రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల విధానాలపై ప్రస్తుత రాజకీయాలు, పార్టీ బలోపేతం చేయడానికి ఏర్పాటు చేసిన సీపీఐ తెలంగాణ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు హనుమకొండలోని హరితకాకతీయ హోటల్‌లో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8గంటలకు హరిత హోటల్‌కు చేరుకున్న జాతీయ నాయకులకు జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజా సీపీఐ జెండాను రాష్ట్ర నాయకులతో కలిసి ఎగురవేశారు. అనంతరం హరితహోటల్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్వర్యంలో మొదటగా రాష్ట్ర కార్యదర్శి, వర్గ సభ్యు లు 11 మందితో, సమావేశం నిర్వహించారు. తరువాత 31 మంది ఎగ్జిక్యూటీవ్‌లతో సమావేశం నిర్వహించారు. అనంతరం 137 మంది స్టేట్ కౌన్సిల్ మెంబర్‌లతో జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు నారాయణ, చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పాల్గొని పార్టీ నిర్ణయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న డి.రాజా

ప్రజాసమస్యలపై ఉద్యమిస్తేనే పార్టీ బలోపేతం

నిత్యం ప్రజా సమస్యలపై ఉద్యమించినప్పుడే కమ్యూనిస్టు పార్టీని మరింత బలోపేతం చేయవచ్చని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా అన్నారు. హనుమకొండలోని కాకతీయ హరిత హోటల్‌లో గురువారం సీపీఐ పార్టీ నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి ఆధ్వర్యంలో తొలిరోజు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఇటీవల వివిధ రాష్ట్రాలలో మరణించిన సీపీఐ నాయకులు, వామపక్ష ప్రజాస్వామ్యవాదుల చిత్రపటాలకు నివాళులు అర్పించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా డి.రాజా మాట్లాడుతూ.. దేశంలో వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలను పార్టీ నాయకులకు వివరించారు. ఈనేపథ్యంలో పెట్టబడిదారీ శక్తులకు ధీటుగా కమ్యూనిస్టులు పని చేయాలని అన్నారు. అట్టడుగు వర్గాలను చైతన్యవంతులను చేయాలని కమ్యూనిస్టు నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె. నారాయణ, సయ్యద్ అజీజ్‌పాష, కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, పశ్య పద్మ, పల్ల వెంకట్‌రెడ్డి, తక్కళ్లపెల్లి శ్రీనివాసరావు, కలవేని శంకర్, వీఎస్ బోస్, బాల మల్లేశ్, బాల నరసింహాలు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన సీపీఐ నాయకులు

‘వరంగల్ జిల్లా’కు గవర్నర్ రాక

ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు పర్యటన

వరంగల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఈనెల 27, 28, 29 తేదీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించనున్నారు. తన పర్యటనలో యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయంతో పాటు ఓరుగల్లులోని అనేక చరిత్రాత్మక కట్టడాలు, లక్నవరం సరస్సును సందర్శించనున్నారు. అలాగే ఉత్తమ ఉద్యోగులతో పాటు కవులు, కళాకారులు, రచయితలతో పరిచయ కార్యక్రమం ఉంటుంది. అలాగే పలువురిని సన్మానించనున్నారు.

గవర్నర్ పర్యటన ఇలా..

● 27వ తేదీ మంగళవారం ఉదయం 7గంటలకు గవర్నర్ హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి ఉదయం 8గంటలకు భువనగిరి జిల్లాలోని యాదగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి చేరుకుంటన్నారు. అక్కడ స్వామి వారిని దర్శించుకుంటారు. అనంతరం 8.45లకు రోడ్డు మార్గాన బయలుదేరి ములుగు జిల్లా కలెక్టరేట్‌కు 11.30గంటలకు చేరుకుంటారు. 12గంటల వరకు విశ్రాంతి తీసుకుంటారు. మధ్యాహ్నం 1గంటకు ఉన్నతాధికారులతో పరిచయం కార్యక్రమం ఉంటుంది. అప్పటి నుంచి 3గంటల వరకు రచయితలు, ఆర్టిస్టులతో పాటు రాష్ట్ర, జాతీయస్థాయిలో అవార్డులు పొందిన వారితో సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయాన్ని సందర్శిస్తారు. పక్కనే ఉన్న భూపాలపల్లి జిల్లా గణపురం మండలకేంద్రంలోని గణపేశ్వరాలయంను సైతం గవర్నర్ సందర్శించనున్నారు. అక్కడి నుంచి గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు వద్దకు సాయంత్రం 6.30గంటలకు చేరుకుని అక్కడే రాత్రి బస చేస్తారు.

● 28వ తేదీ బుధవారం ఉదయం లక్నవరం అందాలను ఆస్వాదిస్తారు. ఆపై ఉదయం 8గంటలకు లక్నవరం నుంచి బయలుదేరి 9.15గంటలకు హనుమకొండలోని నిట్ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 9.45వరకు గెస్ట్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకుంటారు. ఉదయం 10గంటలకు హనుమకొండ సమీకృత కలెక్టరేట్‌కు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేరుకుంటారు. 11.05గంటల నుంచి 12.05గంటల వరకు ఉన్నతాధికారులతో పరిచయ కార్యక్రమం ఉంటుంది. మధ్యాహ్నం 12.15గంటల నుంచి 2.30గంటల వరకు రచయితలు, కళాకారులతో పాటు రాష్ట్ర, జాతీయస్థాయిలో అవార్డులు పొందినవారితో గవర్నర్ పరిచయ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఖిలావరంగల్ కోట, వేయిస్తంభాల ఆలయం, భద్రాకాళి దేవాలయం, పద్మాక్షి గుడితోపాటు నగరంలోని ఇతర ముఖ్యమైన ప్రదేశాలను గవర్నర్ సందర్శిస్తారు. సాయంత్రం 6.40గంటలకు నిట్ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని రాత్రి బస చేస్తారు.

● 29వ తేదీ గురువారం ఉదయం 9గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ జనగామ జిల్లాకు బయలుదేరి వెళతారు. 10 గంటలకు జనగామ జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుని ఉ.11.15గంటల వరకు అధికారులతో పరిచయ కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 11.35గంటలకు ఒబుళాకేశ్వాపూర్ గ్రామానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 2గంటల వరకు రచయితలు, కళాకారులతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు పొందినవారితో పరిచయ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.10గంటలకు ఒబుళాకేశ్వాపూర్ నుంచి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రోడ్డు మార్గాన బయలుదేరి భువనగిరి జిల్లా కొలనుపాకు వెళ్లనున్నారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు రోజుల గవర్నర్ పర్యటన ముగుస్తుంది. కాగా, గవర్నర్ పర్యటన నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లా కలెక్టర్లు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

అధికారులు నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు

నీటి పారుదల శాఖ అధికారులతో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

బాలసముద్రం, ఆగస్టు 22: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఏడాదిలోపు సాగునీటి పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రతీ ఎకరానికి సాగునీరు అందించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో కాల్వల పనులను పరిశీలించి వెంటనే నివేదిక ఇవ్వాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. గురువారం చింతగట్టులోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్ట్ ద్వారా నియోజకవర్గంలోని ప్రతీ ఎకరానికి సాగునీరు అందించడమే తన లక్ష్యమన్నారు. అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఈసందర్భంగా హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవాదుల ప్రాజెక్ట్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తు చేశారు. జనగామ జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడకుండా గోదావరి జలాలను పంటలకు అందించేందుకు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ధర్మసాగర్ సౌత్ కెనాల్, నవాబ్‌పేట మెయిన్ కెనాల్, అశ్వరావుపేట రిజర్వాయర్, నష్కల్ నుంచి పాలకుర్తితో పాటు గండి రామారం రిజర్వాయర్ కింద డిస్ట్రిబ్యూటరీ కాల్వలలో పేరుకుపోయిన పూడిక, జంగిల్ క్లియరెన్స్‌తో పాటు ఇతరత్రా పనులను గుర్తించి అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి 15 రోజుల్లోగా సమగ్రమైన నివేదిక అందించాలని అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో సీఈ అశోక్, వరంగల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, జనగామ ఎస్ఈ సుధీర్, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

అంతరాష్ట్ర మోసాలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

● నకిలీ ప్రెస్, సీబీఐ, కార్డులతో మోసాలు ● రూ.1కోటి 34లక్షలు టోకరా ● వివరాలు వెల్లడించిన సుబేదారీ సీఐ సత్యనారాయణ

బాలసముద్రం, ఆగస్టు 22: వివిధ రాష్ట్రాలలో నకిలీ ప్రెస్‌కార్డులు, సీబీఐ కార్డులు చూపించి ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర ముఠాను గురువారం సుబేదారి పోలీసులు అరెస్టు చేశారు. సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన నిమిత్ కెపాసి (అలియాస్) అమిత్‌కుమార్ (47), సమన్ కాపాసి (అలియస్)కాసోజు జయ(42) ఇద్దరూ కలిసి వివిధ కంపెనీలలో పెట్టుబడి పేరుతో ఇతర రాష్ట్రాల్లో మోసాలకు పాల్పడ్డారు. అమిత్ కుమార్ 2023లో హనుమకొండ జూలైవాడకు చెందిన సయ్యద్ రియాజ్, ప్రవీణ్ కుమార్‌లను పరిచయం చేసుకొని వారికి తన కంపెనీలో ఉద్యోగం ఇచ్చాడు. అదే విధంగా మరికొంత మంది యువకులను నియమించుకుని వారి అకౌంట్ నెంబర్లకు అమిత్‌కుమార్ సెల్ నంబర్ జత చేసి సైబర్ నేరాలకు పాల్పడ్డాడు. తన కంపెనీ సిబ్బంది వసూలు చేసిన డబ్బులను వారి అకౌంట్‌లో వేసుకుంటే అమిత్‌కుమార్ అకౌంట్‌కు డబ్బులు వచ్చే విధంగా మార్చుకుని అమాయకులను మోసం చేశాడు.


సుబేదారి పోలీసు స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణరెడ్డి

వరంగల్, హైదరాబాద్, పూణే, విశాఖపట్నం నగరాలలో పలు కంపెనీలైన స్పీకింగ్ కంపెనీ ప్రైవేటు లిమిటెడ్, మాట్రీ మోని, ఓవర్‌సిస్ కన్సల్టెన్సీ, బ్యాంకు లోన్స్ తదితరు కంపెనీలలో ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేశారు. హిందీ, ఇంగ్లీష్, గుజరాతీ, బెంగాలీ భాషలలో అనర్గళంగా మాట్లాడుతూ ఆధార్‌కార్డు, పాన్ కార్డు అడ్రస్‌లు మార్చి నిందితులు మోసాలకు పాల్పడుతూ సుమారు రూ.1కోటి 34లక్షలు వసూలు చేసినట్లు సీఐ తెలిపారు. వీరిని గురువారం సుబేదారి పోలీసుస్టేషన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఇలాంటి మోసాలు చేసే వారి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏనుమాముల మార్కెట్‌లో మక్కలకు మంచి ధర

గరిష్ఠంగా క్వింటాకు రూ.2,821

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 22: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో గురువారం మొక్కజొన్నలకు మంచి ధర పలికింది. ఇప్పటి వరకు మార్కెట్ చరిత్రలోనే పలకని గరిష్ఠ ధర క్వింటాకు రూ.2,821 పలికింది. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరు గ్రామానికి చెందిన చిలుముల మొగిలి 33 బస్తాల మొక్కజొన్నలను మార్కెట్‌కు అమ్మకానికి తీసుకువచ్చాడు. మాధవి ట్రేడర్స్ అడ్తీ ద్వారా ప్రేమ్ ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు క్వింటాకు రూ.2,821 చొప్పున ఖరీదు చేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు చిలుముల మొగిలి మాట్లాడుతూ మార్కెట్‌లో మక్కలకు ఆశించిన ధర పలికినందుకు సంతోషంగా ఉందన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పంట పండించినందుకు గిట్టుబాటు ధర పలికితే యువకులందరు ఉద్యోగాల కోసం పరుగులు తీయాల్సిన అవసరం లేదన్నారు. ఎవరి భూమిలో వారు వ్యవసాయం చేసుకుంటే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కంటే ఎక్కువే సంపాదించవచ్చని అన్నారు.

సబ్‌స్టేషన్‌లను ప్రొటెక్షన్ టీమ్‌లు తనిఖీ చేయాలి

హనుమకొండ టౌన్, ఆగస్టు 22: ప్రొటెక్షన్ టీమ్‌లు నిత్యం సబ్‌స్టేషన్‌లను తనిఖీ చేస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి సూచించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని అన్ని జిల్లాల ఎస్ఈలు, యంఆర్‌టీ, టెక్నికల్ డీఈలతో గురువారం హనుమకొండ నక్కలగుట్ట విద్యుత్‌భవన్ నుంచి సీఎండీ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ కాకుండా డబుల్ ఎర్తింగ్ ఉండాలని సూచించారు. సర్వీసులను డిజిటలైజేషన్ చేయాలని, అలాగే ట్రాన్స్‌ఫార్మర్ల మ్యాపింగ్ వేగవంతం చేయాలన్నారు. లోడ్ ఎక్కువ ఉన్న చోట కెపాసిటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీఎం షెడ్లలో సిబ్బంది నైపుణ్యత పెంచడానికి శిక్షణ తరగతులను నిర్వహించాలని ఆదేశించారు. ఆ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్స్ అశోక్‌కుమార్, మధుసూదన్, సీజీఎంలు, జీఎంలు పాల్గొన్నారు.

నిబంధనలు విస్మరించి అడ్డగోలు రిజిస్ట్రేషన్లు

ఆలస్యంగా వెలుగులోకి ఇద్దరు సబ్ రిజిస్ట్రార్‌ల బాగోతం



రాంనగర్, ఆగస్టు 22: ప్రభుత్వం ఎన్ని నిబంధనలు పెట్టినా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో జరిగే అక్రమాలను అడ్డుకోవడం సాధ్యం కాదనే ఆరోపణలున్నాయి. ఆస్తుల రిజిస్ట్రేషన్‌ల విషయంలో జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకు గత ప్రభుత్వం ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. నాన్ లేఅవుట్ ప్లాట్లు, పార్ట్, అనుమతులు లేని ఇళ్ల రిజిస్ట్రేషన్‌లు చేయకూడదనే నిబంధనలు పొందుపరిచింది. ఈ నిబంధనలను బుట్టదాఖలు చేసిన పలువురు సబ్ రిజిస్ట్రార్‌లు విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్‌లు చేసిన విషయం తెలిసిందే. నిబంధనలు విస్మరించి రిజిస్ట్రేషన్‌లు చేసేందుకు డబ్బులు దండుకుంటూ మహబూబాబాద్, పరకాల సబ్ రిజిస్ట్రార్‌లు ఏసీబీకి అడ్డంగా దొరికిన సంఘటనలు సైతం ఉన్నాయి.

కాగా, ఈ సంఘటనలు జరుగుతుండగానే ఖిలా వరంగల్, వరంగల్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిబంధనలు విస్మరించి పలు రిజిస్ట్రేషన్‌లు చేసి అందినంత దండుకున్న ఇద్దరు సబ్ రిజిస్ట్రార్‌ల బాగోతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల జరిగిన బదిలీల్లో పొరుగు జిల్లాలకు బదిలీ అయిన ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్‌లు పదుల సంఖ్యలో నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు తెలిసింది. ఖిలావరంగల్ సబ్‌రిజిస్ట్రార్ పరిధిలోని బొల్లికుంటలో వెలిసిన ఒక నాన్ లేఅవుట్ వెంచర్‌కు సంబంధించిన 40కి పైగా రిజిస్ట్రేషన్‌లు కిందటేడు నెలాఖరున జరిగినట్లు తెలిసింది. ఈ రిజిస్ట్రేషన్‌లు ఒకే రోజున జరిగినవి కాగా, మిగతా రోజుల్లో చాలానే జరిగినట్లు సమాచారం. సదరు సబ్ రిజిస్ట్రార్ గజానికి రూ.200 చొప్పున డబ్బులు దండుకుని నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు తెలిసింది. ఇక వరంగల్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ గొర్రెకుంటకు చెందిన నాన్ లేఅవుట్ 30కి పైగా ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు సమాచారం. మూడు మాసాల్లో ఈ రిజిస్ట్రేషన్‌లు జరిగినట్లు తెలిసింది. ఈ రిజిస్ట్రేషన్‌లకు సైతం సదరు సబ్ రిజిస్ట్రార్ గజాల లెక్కన వసూలు చేసినట్లు సమాచారం. ఈ ఇద్దరు వసూలు చేసిన మొత్తం లక్షల్లో ఉంటుందనే ప్రచారం సాగుతోంది. వీరిద్దరు ప్రస్తుతం పొరుగు జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. బదిలీపై వెళ్లిన ఇద్దరు అధికారులపై గతంలో సైతం పలు ఆరోపణలున్నాయి. మొత్తంగా జిల్లాను వీడిన వీరి బాగోతంపై ఉన్నతాధికారులు ఏ మేరకు స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

భగ్గుమన్న బీఆర్ఎస్

అంక్షలు లేని 'రైతు రుణమాఫీ' అమలు చేయాలని నిరసనలు



భూపాలపల్లిలో బీఆర్ఎస్ శ్రేణుల రాస్తారోకో



ఏటూరునాగారంలో బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన

కృష్ణకాలనీ (భూపాలపల్లి): రైతులందరికీ ఎలాంటి అంక్షలు లేకుండా పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ భూపాలపల్లిలోని అంబేద్కర్ కూడలిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి హాజరయ్యారు. ప్రధాన రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్, ఉమెన్ ఎస్సైలు సంధ్యారాణి, స్వప్నకుమారి అక్కడకు చేరుకొని ఆందోళనను విరమింపజేసి వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గండ్ర జ్యోతి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విద్యాసాగర్‌రెడ్డి, బుర్ర రమేష్, ఇతర నాయకులు మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

• మొగుళ్లపల్లి: రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలోని చౌరస్తాలో రాస్తారోకో చేశారు. నాయకులు జోరిక సదయ్య, చదువు అన్నారెడ్డి, పిన్నింటి వెంకట్రావు, దానవేన రాములు, ప్రభురెడ్డి, కుమార్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

• ఏటూరునాగారం: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, పార్టీ సీనియర్ నాయకుడు తుమ్మ మలారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎమ్డీ. ఖాజాపాషా, మాజీ సర్పంచ్ ఈసం రామ్మూర్తి, నాయకులు సప్పిడి రామ్‌నర్సయ్య, తూరం పద్మ, కాళ్ల రామకృష్ణ, దొడ్డ కృష్ణ, బాసాని శేఖర్, కొండాయి చిన్న, భట్టు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

• ములుగు రూరల్: షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని అఖిలపక్ష రైతు సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సర్వాపూర్‌లోని అంబేద్కర్ సెంటర్ వద్ద నిరసన తెలిపారు. రైతు సంఘాల నాయకులు అప్పాజీ ఐలయ్య, గుండెబోయిన రవిగౌడ్, శ్రీహరి, రాజు, అవుల లక్ష్మీనారాయణ, సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

• గోవిందరావుపేట: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లకావత్ నర్సింహనాయక్ ఆధ్వర్యంలో నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సృజన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు పి.మధుసూదన్‌రెడ్డి, హనుమంతరావు, భూక్య దేవా, లావుడ్యా రాంచందర్, ఆలూరి శ్రీనివాసరావు, ఎస్.రవీందర్‌రావు, వెలిశాల స్వరూప, మధు, కొండి రమేష్, హేమాద్రి, కృష్ణ, దూడపాక రవీందర్, బత్తుల రాణి, ఫక్రుద్దీన్, ప్రసాద్, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

• తాడ్వాయి: మండల కేంద్రంలోని 163వ జాతీయ రహదారిపై బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఆత్మా చైర్మన్ దుర్గం రమణయ్య, పార్టీ మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, నాయకులు దిడ్డి మోహన్‌రావు, నూశెట్టి రమేష్, బాపిరెడ్డి, రామసహాయం శ్రీనివాసరెడ్డి, కొండేటి నరేష్, గడ్డం అరుణ, చిడం బాబూరావు, నగేష్, దిలావర్‌ఖాన్, విక్రం, సాంబయ్య పాల్గొన్నారు.

• వాజేడు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెనుమల్లు రామకృష్ణారెడ్డి ఆధ్వ ర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం నాయబ్ తహసీల్దార్ రాహుల్ చంద్ర వర్మకు వినతిపత్రం సమర్పించారు. మాజీ ఎంపీపీ స్వరూప, మాజీ ఎంపీటీసీ రమణబాబు, నాయకులు తిరుపతి యాదవ్, సతీష్, ఆశోక్‌రెడ్డి, మీనయ్య, కొత్తగట్టు సాంబం తదితరులు పాల్గొన్నారు.

• వెంకటాపూర్(రామప్ప): బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగాల రమణారెడి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తాళ్లపాడు సెంటర్‌లో ములుగు-పరకాల ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు మల్లయ్య, మల్క రమేష్, మహమ్మద్ అల్లిమియా, కాసర్ల కుమారస్వామి, నర్ర భద్రయ్య, మేడబోయిన అశోక్, గట్టు కుమారస్వామి, జగన్మోహన్‌రావు, రహీముద్దీన్, జ్ఞానేందర్, సామర్ల రాజమౌళి, ప్రసాద్‌రెడ్డి, పోశాల వీరమల్లు, అశోక్, దగ్గు ప్రభాకర్‌రావు, జనగాం రవీందర్, జహీర బాషాతోపాటు పెద్దసంఖ్యలో కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

• గణపురం: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్నాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. లక్ష్మీనరసింహారావు, పూర్ణచందర్‌రెడ్డి, మధుసూదన్‌రావు, శ్రీనివాస్, సుధాకర్, కుమారస్వామి పాల్గొన్నారు.

• మంగపేట: రైతు రుణమాఫీని ఆంక్షల్లేకుండా వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు మండల కేంద్రంలోని పాత బస్టాండ్ నుంచి గంపోనిగూడెం వరకు ర్యాలీ నిర్వహించారు. బూర్గంపహాడ్-ఏటూరునాగారం ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం రైతు వేదిక భవనం వరకు ర్యాలీగా వెళ్లి వ్యవసాయాధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు తాటి కృష్ణ, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కుడుముల లక్ష్మీనారాయణ, గుండేటి రాజు యాదవ్, మంగపేట సహకార సంఘం చైర్మన్ తోట రమేష్, నాయకులు కర్రి శ్యాంబాబు, ఎడ్లపెల్లి నర్సింహారావు, మలికంటి శంకర్, ఖుర్బాన్ అలీ, సహకార సంఘం వైస్ చైర్మన్ నరేందర్ యాదవ్, సహకార సంఘం డైరెక్టర్లు సిద్దంశెట్టి లక్ష్మణ్‌రావు, ఎస్. నర్సయ్య యాదవ్, మల్లూరు దేవస్థానం మాజీ చైర్మన్ నూతలకంటి ముకుందం, బీఆర్ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు గోస్కుల లక్ష్మి యాదవ్, మైనారిటీ విభాగం మండల అధ్యక్షుడు ఎస్కే. అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

• కన్నాయిగూడెం: మండల కేంద్రంలోని తుపాకులగూడెం -ఏటూ రునాగారం ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు సుబ్బుల సమ్మయ్య నాయకులు కావేరి చిన్నికృష్ణ, కిషోర్, వెంకటేశ్, సంతోష్ పాల్గొన్నారు.

సస్పెండైన డీఆర్‌డీఏ పీడీపై విచారణ

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 22: భూపాలపల్లి జిల్లా డీఆర్‌డీఏ పీడీగా పనిచేసి మహబూబాబాద్‌కు బదిలీపై వెళ్లి సస్పెన్షన్‌కు గురైన పురుషోత్తంపై గురువారం సెర్ప్ విభాగం హైదరాబాద్ డైరెక్టర్లు విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా భూపాలపల్లి కార్యాలయానికి చేరుకున్నారు. భూపాలపల్లిలో పనిచేసినప్పుడు ఆయనపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ క్రమంలో ఆయన బదిలీ అయినప్పటికీ రెండు నెలల్లో విచారణ నేపథ్యంలోనే ఆయన్ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈ క్రమంలోనే మరింత లోతుగా వివరాలు సేకరించేందుకు సెర్ప్ డైరెక్టర్లు భూపాలపల్లికి గురువారం చేరుకున్నారు.

హత్యాయత్నం కేసు నిందితుడి అరెస్టు

కాటారం, ఆగస్టు 22: మండలంలోని గుండ్రాత్ పల్లిలో మంగళవారం రాత్రి నగునూరి సాయికిరణ్‌పై కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డ మంచిర్యాల జిల్లా బావురావుపేటకు చెందిన కమ్మగోని ప్రణయ్‌ను బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

వాహనాల బహిరంగ వేలం

కాటారం, ఆగస్టు 22: మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ నాలుగు వాహనాలను గురువారం బహిరంగ వేలం వేశారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ లింగాచారి సమక్షంలో వాహనాల వేలం వేయగా రూ.16,600 సమకూరినట్లు ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 22: మండలపరిధిలో ఇటీవల సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు స్థానిక ఎస్సై జక్కుల సతీష్ గురువారం అందజేశారు. హనుమకొండకు చెందిన చంద్రశేఖర్, చిన్నకోర్నేల్‌కు చెందిన చింతల అనిల్ అనే కానిస్టేబుల్ సెల్‌ఫోన్లను ఇటీవల పోగొట్టుకున్నారని అన్నారు. వారు ఇచ్చిన ఫిర్యాదుతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్లను గుర్తించి అందజేసినట్లు తెలిపారు. సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న పూర్తి ఆధారాలతో పోలీసులను ఆశ్రయించాలన్నారు.

● తాడ్వాయి : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బాధితులు ఇటీవల సెల్‌ఫోన్లు పోగొట్టుకోగా స్థానిక ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి గురువారం అందజేశారు. మండలంలోని కాల్వపల్లికి చెందిన రాసాల సురేష్, కొడిశాలకు చెందిన యాప నారాయణ, వరంల్ ఏనుమాములకు చెందిన ఇనుముల విష్ణుల సెల్‌ఫోన్లు ఇటీవల పోగా వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి పోలీస్‌శాఖ రూపొందిన ప్రత్యేక పోర్టల్‌లో గుర్తించి అందజేశారు. అదేవిధంగా మండలంలోని కొండపర్తి, దామెరవాయి, పంబాపూర్ గ్రామాల్లో ఎస్సై సైబర్ నేరాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు చేసే కాల్స్‌ను పట్టించుకోవద్దని, ఎవరూ ఓటీపీ నంబర్ చెప్పవద్దని అన్నారు.

ఓటరు జాబితాలో పారదర్శకత పాటించాలి

సమీక్ష సమావేశంలో కలెక్టర్ దివాకర



మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు, ఆగస్టు 22: రాబోయే గ్రామ పంచాయతీ సాధారణ ఎన్ని కలను విజయవంతంగా నిర్వహిం చేందుకు పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించాలని కలెక్టర్ టీఎస్.దివాకర అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీలలో ఓటరు జాబితాను రూపొందించడం పట్ల ఎన్నికలకు నిర్వహించే అధికారులకు పూర్తి అవగాహన ఉంటుందని అన్నారు. గత పార్లమెంటు ఎన్నికల్లో రూపొం దించిన ఓటరు జాబితా ఆధా రంగా గ్రామపంచాయతీ లిస్టులను తయారు చేస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ టీ-పోల్‌లో గ్రామపంచాయతీ ఓటరు జాబితా నుంచి వార్డులవారీగా మ్యాపింగ్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి.శ్రీజ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుప్త నిధులు తవ్విన వ్యక్తులపై కేసు

చెన్నారావుపేట, ఆగస్టు 22 : మండలంలోని పాపయ్యపేటలో గుప్త నిధులు తవ్విన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ గురువారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన చీనూరి యాకయ్య ఇంట్లో గుప్తనిధుల కోసం తవ్వకాలు చేయగా గుర్తించిన పోలీసులు ములుగు జిల్లా వాజేడు మండలానికి చెందిన రాచకొండ నర్సింహాస్వామి, చీనూరి యాకయ్య, మామిడాల రమేష్‌పై కేసులు నమోదుచేశారు. మరికొంత మందిపై విచారణ జరుగుతున్నట్లు ఎస్సై వివరించారు.

విస్తృతంగా 'ప్లాంట్ ఫర్ మదర్'

కాటారం, ఆగస్టు 22: మండలంలో గురువారం ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమం విస్తృతంగా నిర్వహించారు. పలు శాఖల అధికారులు, సిబ్బంది ప్రజల భాగస్వామ్యంతో 'నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద' అనే కార్యక్రమంలో చేపట్టారు. మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత అందరూ తీసుకో వాలని ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి అన్నారు. ఈకార్యక్రమాల్లో ఈజీఎస్ ఏపీవో వెంకన్న, టీఏలు మనోజ్, శ్రీనివాస్, రవళి, రవి, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యా అధికారి తనిఖీ

మల్హర్, ఆగస్టు 22: మండల కేంద్రమైన తాడిచర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఇంటర్ విద్యా జిల్లా నోడల్ అధికారి భూక్య వెంకన్న తనిఖీ చేశారు. కళాశాల నిర్వహణతోపాటు ఆవరణాన్ని పరిశీలిం చారు. కళాశాలలోని రికార్డులను తనిఖీ చేశారు. తరగతి గదుల నిర్వహణను పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన్ను అధ్యాపకులు సన్మానించారు. ప్రిన్సిపాల్ విజయ దేవి, అధ్యాపకులు రవీందర్, నరేందర్, ప్రవీణ్, వెంకట్‌రెడ్డి, కరుణాకర్, స్వరూపరాణి, నరేష్, భరత్‌రెడ్డి, జయపాల్, రవి తదితరులు పాల్గొన్నారు.

బాల పురస్కార్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

ములుగు, ఆగస్టు 22: ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాలల పుర స్కార్ అవార్డుకు జిల్లాలోని అర్హులైన బాలలు దరఖాస్తు చేసుకో వాలని జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనిన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించిన ప్రతిభావంతులైన 5-18 ఏళ్లలోపు బాలబాలికలు దరఖాస్తు చేసుకో వాలని పేర్కొన్నారు. అదేవిధంగా వివిధ నూతన ఆవిష్కరణలు, సామాజిక సేవ, పర్యావరణం, క్రీడలు, కళలు, సంస్కృతి, శాస్త్ర, సాంకేతిక అంశాల్లో ప్రతిభాపాటవాలు ప్రదర్శించిన చిన్నారులు కూడా హెచ్‌టీటీపీఎస్://అవార్డ్స్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 31లోగా దర ఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 9440615158 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ములుకలపల్లి రేషన్ ఇన్‌చార్జి డీలర్‌గా విజయ

మొగుళ్లపల్లి, ఆగస్టు 22: మండలంలోని ములుకలపల్లి రేషన్‌షాపు ఇన్‌చార్జి డీలర్‌గా నాగల గాని విజయ్‌కు బాధ్యతలు అప్పగిస్తూ తహసీల్దార్ సునీత గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ములు కలపల్లి రేషన్ షాపు యజమాని రేపాల పోశెట్టి కరోనాతో మృతి చెందాడు. అప్పటి నుంచి పోతుగల్లు రేషన్ డీలర్ యజమాని రవీందర్‌కు ఇన్‌చార్జి బాధ్య తలు అప్పగించారు. దీంతో ఆయనకు గ్రామం ఆరు కిలోమీటర్ల దూరం ఉండడంతో సమయానికి రేషన్ షాపు తీయక పోవడంతో గ్రామస్థులు ఇబ్బంది పడ్డారు. గ్రామస్థుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి ఆయన్ను ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించారు. సెప్టెంబరు నుంచి గణేష్‌పల్లి గ్రామంలోని రేషన్ డీలర్ విజయకు ములుకలపల్లి రేషన్‌షాపు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

సీజనల్ వ్యాధులపై కలెక్టర్ సమీక్ష

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 22: 'జ్వర పంజా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనంపై కలెక్టర్ రాహుల్‌శర్మ స్పందించారు. కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో గురువారం సమావేశమై సీజనల్ వ్యాధులపై సమీక్షించారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న దృష్ట్యా వ్యాధి నిర్ధారణ పరీక్షలు పెంచాలన్నారు. గత సంవత్సరం సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు 27 డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కేసులు నమోదయ్యాయని, మళ్లీ అదే నెలల్లో వచ్చే అవకాశం ఉన్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మంగళ, శుక్రవారాల్లో డ్రైడేను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో మధుసూదన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకును తరలించాలని ధర్నా

ఏటూరునాగారం, ఆగస్టు 22: ఏటూరునాగారంలో ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంకును తమ మండలానికి తరలించాలని డిమాండ్ చేస్తూ కన్నాయిగూడెం రైతులు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు గురువారం ధర్నా చేశారు. భూపాలపల్లి, ములుగు జిల్లాల రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు, బీజేపీ జిల్లా నాయకులు పల్లా బుచ్చయ్య మాట్లాడుతూ గతంలో పీఎన్‌బీ బ్యాంకును కన్నాయిగూడెంలో ఏర్పాటు చేశారని, ఆ తర్వాత ఏటూరునాగారానికి తరలించారని అన్నారు. కన్నాయిగూడెం రైతులు, ఖాతాదారులు ఏటూరునాగారం రావాలంటే ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి ఏటూరునాగారంలో ఉన్న బ్యాంకును వెంటనే కన్నాయిగూడెం తరలించాలని డిమాండ్ చేశారను. ఈ కార్యక్రమంలో కన్నాయిగూడెం మాజీ ఎంపీటీసీ అరుణ్ కుమార్, గూరేవుల మాజీ ఉప సర్పంచ్ కొప్పుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధికారులు

మహదేవపూర్, ఆగస్టు 22 : మహదేవపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో పల్లె ప్రకృతి వనం ఆవరణలో నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద కార్యక్రమంలో భాగంగా గురువారం మొక్కలు నటారు. అనంతరం కాళేశ్వరం గ్రామ పంచాయతీ పరిధిలోని ముక్తీశ్వరస్వామి టెంపుల్ దగ్గరలో ఉన్న కమ్యూనిటీ ప్లాంటెషన్ స్థలంలో మొక్కలు నాటారు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మండల పంచాయతీ అధికారి ప్రసాద్, ఉపాధి హామీ ఏపీవో రమేష్, కాళేశ్వరం, మహదేవపూర్ గ్రామ పంచాయతీల కార్యదర్శులు సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస అధ్యక్షుడు కోట రాజబాబు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంజేపీ విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్

గణపురం, ఆగస్టు 22: మం డలంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల రెసిడెన్షియల్ విద్యాలయాన్ని కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం సందర్శించారు. కిచెన్, స్టోర్‌రూం, డార్మటరీ, తర గతి గదులను పరిశీలించారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠా లు అర్థమ వుతున్నాయా? అని విద్యా ర్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థినులకు భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి నరేష్, ఎంపీడీవో భాస్కర్, ప్రిన్సిపాల్ స్వప్న తదితరులు ఉన్నారు.

గంజాయి నిర్మూలనకు సహకరించాలి

ఏటూరునాగారం రూరల్, ఆగసు 22: గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై తాజుద్దీన్ అన్నారు. మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గంజాయి, గుడుంబా, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని గురవారం నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్‌ను వాడి బంగారు భవిష్యత్తు య ఉవత నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి, డ్రగ్స్, గుడుంబా విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓసీని తనిఖీ చేసిన డీడీఎంఎస్

కాకతీయఖని, ఆగస్టు 22: సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్-2 గనిని డీడీఎంఎస్ (ఎలక్ట్రికల్) ఎస్.కె.నాగుల్‌మీరా గురువారం తనిఖీ చేశారు. పని స్థలాలను, యంత్రాను, ఎలక్ట్రికల్ పరికరాలను పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకుంటున్న జాగ్రత్త చర్యలను గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సింగరేణి అధికారులు జీఎల్ ప్రసాద్, సారంగపాణి, వెంకట్రామిరెడ్డి, కృష్ణప్రసాద్ ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 22: పది రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన భూపాలపల్లి మండలంలోని కమలాపూర్‌కు చెందిన యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మహాముత్తారం మండలం యామన్‌పల్లికి వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై బయల్దేరిన సుమన్ (22) స్వగ్రామం కమలాపూర్‌కు తిరిగి వస్తుండగా మార్గమధ్య ప్రధాన రహదారిపై ఒక్కసారిగా ఎదురుగా గేదె అడ్డొచ్చింది. దానిని త ప్పించబోయిన అతడు కిందపడిపోయాడు. దీంతో తలకు తీవ్రగాయమైంది. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న క్రమంలో గురువారం మృతి చెందాడు. మృతుడు అవివాహితుడు కాగా తల్లిదండ్రులు ఇదే గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు.

మూడు దుకాణాల్లో చోరీ

ఏటూరునాగారం, ఆగస్టు 22: మండల పరిధి రామన్నగూడెంలోని ప్రధాన రోడ్డు పక్కన ఉన్న మూడు చిరు దుకాణాల్లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. షాపుల తాళాలు పగలగొట్టి కూల్ డ్రింక్స్, ఇతర సామగ్రితో పాటు సీసీ కెమెరాలకు చెందిన హార్డ్ డిస్కులు ఎత్తుకెళ్లారు.

దివ్యాంగుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

గోవిందరావుపేట, ఆగస్టు 22: గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల్లోని అర్హులైన దివ్యాంగులు సహాయ ఉపకరణాలు పొందాలని జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనిన అన్నారు. గురువారం మండలంలోని పస్రా గ్రామపంచాయతీ ఆవరణలో అలింకో సహకారంతో దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు అందించేందుకు ఏర్పాటు చేసిన గుర్తింపు శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. దివ్యాంగుల సౌకర్యార్థం ములుగులో జిల్లాలోని మూడు ప్రాంతాల్లో ప్రత్యేక గుర్తింపు శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల్లోని దివ్యాంగులు పెద్దసంఖ్యలో హాజరై శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో జవహర్‌రెడ్డి, సీడీపీవో మల్లీశ్వరి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఓంకార్, ఎంపీవో శరత్, ఏపీవో ప్రసూనరాణి, ఏపీఎం నాగేశ్వర్‌రావు, అలింకో ప్రతినిధులు ఆశిష్, ప్రియ, ఇతరశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ములుగు, ఆగస్టు 22: పట్టా పాస్‌బుక్కులేని రైతులకు కూడా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసంద ర్భంగా సీపీఐ రాష్ట్ర నాయకుడు తాటిపాముల వెంకట్రాములు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం పంట రుణాన్ని మాఫీ చేసిందని, పట్టాదారు పాస్‌పుస్తకాలు లేని రైతులకు కూడా మాఫీ చేయాలన్నారు. అదేవిధంగా కొంతమంది రైతులు తెలియక రుణాలను రెన్యువల్ చేసుకోలేదని, వారికి కూడా రుణాలు మాఫీ చేయాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ దివాకరకు అందజేశారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్, రైతుసంఘం నాయకులు ఎమ్డీ.అమ్జద్‌పాషా, ఇంజం కొమురయ్య, గుంజె శ్రీనివాస్, మాతంగి శ్యాంసుందర్, వడి సారయ్య, జక్కుల ఐలయ్య, నటరాజ్, రూప్‌సింగ్, సమ్మయ్య, ముత్తయ్య, మర్రి స్వామి, రవి, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయ అధికారిని కలిసిన కాంగ్రెస్ నేతలు

ములుగు, ఆగస్టు 22: ములుగు జిల్లా వ్యవసాయ అధికారిగా బాధ్యతలు చేపట్టిన సురేష్‌ను కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు గురు వారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారు సురేష్‌ను సన్మానించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనకు నిరసనగా ఉపాధ్యాయుల ర్యాలీ



ర్యాలీలో ఉపాధ్యాయులు

కాటారం, ఆగస్టు 22: కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచార ఘటనకు నిరసగా మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో పలు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. వైద్యురాలి ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఉపాధ్యాయ సంఘాలకు కాం గ్రెస్ నేతలు, ప్రజాసంఘాల నాయకులు సంఘీ బా వం తెలిపారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, ఆర్‌యూపీపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం లక్ష్మయ్య మాట్లాడుతూ వైద్యురాలి హత్యాచారం ఘటనకు కారకులైన నిం దితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీడీవో బాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, డీయూఎఫ్ఐ రాష్ట్ర నేత అక్కల బాపు, డీటీఎఫ్, ఎస్‌టీయూ, టీపీటీఎఫ్ జిల్లా, మండల నేతలు లక్ష్మణ్‌నాయక్, పర్వీన్, భోజ్యానాయక్, అనిల్, మొయిన్, రాజబాబు, రమేష్‌నాయక్, పరంసింగ్ పాల్గొన్నారు.

10 వేల గాజులతో ఉమాదేవికి ప్రత్యేక పూజలు

మంగపేట, ఆగస్టు 22: స్థానిక ఉమాచంద్ర శేఖరస్వామి దేవస్థానంలో వెలిసియున్న ఉమాదేవి (పార్వతీదేవి) అమ్మవారిని పదివేల గాజులతో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసంలో భాగంగా ప్రధానార్చకుడు విస్సావజ్జుల నరేష్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఈ పూజలు చేశారు. మంగపేట, పొద్మూరు, గంపోనిగూడెం, బోరునర్సాపురం, కమలాపురం, కోమటిపల్లి, చెరుపల్లి, తిమ్మంపేట గ్రామాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

రాజకీయ లబ్ధి కోసమే రుణమాఫీపై రగడ : కాంగ్రెస్

మొగుళ్లపల్లి, ఆగస్టు 22: రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ నాయకులు రుణమాఫీపై ధర్నా, రాస్తారోకోల పేరుతో రగడ సృష్టిస్తున్నారని కాంగ్రెస్ జిల్లా నాయకుడు తక్కళ్లపల్లి రాజు అన్నారు. ఈమేరకు గురువారం ఆయన మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా ప్రజావ్యతిరేక నియంతృత్వ పాలనకు ప్రజలు చరమగీతం పాడి ప్రజాపాలన కోసం కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై దరఖాస్తులు తీసుకుని వాటి పరిష్కారమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతోందన్నారు.

దోషులను శిక్షించాలి : ఎస్ఎఫ్ఐ

ఏటూరునాగారం, ఆగస్టు 22: కోల్‌కతాలో మహిళ వైద్యురాలిపై హత్యాచారం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు ముక్కెర ధనుష్, కార్యదర్శులు బట్ట స్వామి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని క్రాస్ రోడ్డు నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు ఉమేష్, మనోజ్, సత్యనారాయణ, వినోద్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.